ప్రజాశక్తి

సోమవారం 8 డిసెంబర్ 2025 5

అనంతపురం



గొర్రెల మందపై దూసుకెళ్లిన తుఫాన్ వాహనం

ప్రజాశక్తి - బెలుగుప్ప

బెలుగుప్ప మండల పరిధిలోని కాలువపల్లి బ్రిడ్జి వద్ద ఆదివారం గొర్రెలమందపైకి తుఫాను వాహనం దూసుకెళ్లిన ప్రమాదంలో 40 గొర్రెలు మృతిచెందాయి. మరో 15 తీవ్రగాయాలపాలయ్యాయి. దీంతో తనకు రూ.15 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత గొర్రెలకాపరి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈఘటనకు సంబందించిన వివరాలు...

మెయిన్‌లో..



మృతిచెందిన గొర్రెలు

పిఎబిఆర్ కుడికాలువకు గండి

పంటపొలాల్లోకి నీరు

ప్రజాశక్తి - అనంతపురం

కూడేరు మండల పరిధిలోని పీఏబీఆర్ కుడికాలువ 4వ కిలోమీటరు వద్ద జల్లిపల్లి గ్రామం సమీపాన శనివారం రాత్రి గండిపడింది. దీంతో నీరు పంటపొలాల్లోకి వెళ్లింది.గమనించిన గ్రామస్తులు హెచ్‌ఎల్‌సి అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో అధికారులు పిఎబిఆర్ కుడికాలువకు ఉన్న గేట్లను మూసివేయడానికి ప్రయత్నించారు. అయితే గేట్లు స్తంభించిపోవటంతో పిఎబిఆర్ నుంచి నీటిని పెనకచెర్ల డ్యాం (ఎంపిఆర్)కు వదిలారు. దీంతో కుడికాలువకు నీటి ప్రవాహం తగ్గిపోయింది. ఈసందర్భంగా హెచ్‌ఎల్‌సి ఎఇ ఓబుళరెడ్డి మాట్లాడుతూ పిఎబిఆర్ నుంచి కుడి కాలువకు మూడు రోజుల నుండి నీరు విడుదల చేశామన్నారు. డ్యాం సమీపంలోని జల్లిపల్లి గ్రామం దగ్గర నాలుగు కిలోమీటర్ల దూరంలో కాలువకు గండిపడి రైతుల పంట పొలాల్లోకి నీరు వెళ్లిందన్నారు. నీటిని విడుదల చేసిన గేట్లు మొరాయించడంతో ఏటి కాలువ ద్వారా నీటిని పెనకచెర్ల డ్యాంకు విడుదల చేస్తున్నామన్నారు. మొరాయించిన గేట్లు రిపేర్ చేయడానికి సంబంధించిన ఇంజనీర్లు తుంగభద్ర డ్యాంనుంచి రావాల్సుందన్నారు. గేట్ల మరమ్మతుకు రెండు మూడు రోజులు అవుతుందని అన్నారు. గండిపడిన కుడి కాలువ మరమ్మతు పనులు త్వరతగతిన చేపట్టి నీటిని విడుదల చేస్తామని చెప్పారు.

ఆర్థికమంత్రి ఆరా : పిఎబిఆర్ కుడికాలువకు గండిపడిన విషయం తెలుసుకున్న ఆర్థిశాఖమంత్రి పయ్యావుల కేశవ్ కలెక్టర్ ఓ. ఆనంద్‌తో మాట్లాడారు. గండిపడిన చోట వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే రైతుల నీట మునిటిన పంటపొలాలను పరిశీలించి పంట నష్టం అంచనా వేయాలని చెప్పారు.

గండిని పూడ్చి నీటిని విడుదల చేయాలి : పిఎబిఆర్ కుడికాలువకు పడిన గండిని వెంటనే పూడ్చివేసి కాలువ మరమ్మతు చేసి నీటిని విడుదల చేయాలని వైసిపి నియోజకవర్గ నాయకులు, వైసిపి రాష్ట్ర విద్యార్థివిభాగం జోనల్ ఇన్‌ఛార్జి ప్రణయ్‌రెడ్డి కోరారు. ఈసందర్భంగా ఆయన ఆదివారం గండిపడిన ప్రదేశాన్ని పరిశీలించారు. కుడి కాలువ కింద 49 చెరువులు ఉన్నాయని,ఆ చెరువులకు పూర్తిస్థాయిలో నీరు చేరాలంటే కాలువకు గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జల్లిపల్లి వద్ద కుడి కాలువకు గండిపడి పెద్ద ఎత్తున నీరంతా రైతుల పొలాల్లోకి ప్రవహించిందన్నారు. దీంతో వరి, వేరుశనగ, చీని పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు.



పిఎబిఆర్ కుడికాలువకు గండి పడటంతో నీరు వృథాగా వెళుతున్న దృశ్యం

తుంగభద్ర ఎగువ కాలువకు గండి

ప్రజాశక్తి - రాయదుర్గం/బొమ్మనహాల్

అనంతపురం జిల్లా డి. హీరేహాల్, బొమ్మనహాల్ మండలాల పరిధిలో ఉన్న తుంగభద్ర ఎగువ కాలువ 113 / 557 కిలోమీటర్ వద్ద ఆదివారం ఉదయం గండిపడింది. దీంతో పెద్ద ఎత్తున నీరు అండర్ టన్నల్ ద్వారా దిగువన వెళుతున్నాయి. కాలువ అండర్ టర్నల్ సైడ్ వాల్ దెబ్బతిని కూలడంతో కాలువకు గండి పడింది. దీంతో స్థానిక రైతులు తుంగభద్ర ఎగువ కాలువ అధికారులకు సమాచారం అందించారు. ఎగువ కాలువ గట్లు పలుచోట్ల బలహీనంగా ఉండటంతో తరచూ గండ్లు పడుతున్నాయి. నీరు పెద్ద ఎత్తున వృథా కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే గండిని పూడ్చాలని, బలహీనంగా ఉన్న చోట గట్టుకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. తుంగభద్ర ఎగువ కాలువ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మద్దిలేటి, డిఇ దివాకర్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ అల్తాఫ్ సిబ్బందితోపాటు గండి పడిన చోటుకి చేరుకొని నీరు వృథా కాకుండా మరమ్మతులు చేపట్టారు. ఎస్కేప్ వద్ద నీటిని బయటికి వదిలి నీటి మట్టం తగ్గిన తర్వాత మరమ్మతులు చేయడం జరుగుతుందని హెచ్‌ఎల్‌సి డిఇ తెలిపారు.



హెచ్‌ఎల్‌సి కాలువ తెగిన దృశ్యం

నీటి సంపులో పడి అన్నదమ్ములు మృతి

ప్రజాశక్తి - బ్రహ్మసముద్రం

అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురం గ్రామంలో వ్యవసాయ నీటిసంపులో పడి అన్నదమ్ములైన ఇద్దరు యువకులు మృతిచెందారు. ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబందించి బాధితులు, పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు... కళ్యాణదుర్గం పట్టణం వాల్మీకి సర్కిల్ బోయ వీధి (సౌత్ స్కూల్ వీధి) శెట్టూరు రోడ్డు లో నివాసమున్న నికి చెందిన తలారి వెంకటేశులు వరుసకు తమ్ముడైన రాము పాల వెంకటాపురం గ్రామంలోని అమర శేషు వీరారెడ్డికి చెందిన మామిడితోటను రెండేళ్లకు రూ.20 లక్షలకు కౌలు(గుత్త)కు తీసుకుని పంటసాగు చేశారు. ఈ నేపథ్యంలో వీరు ఆదివారం ఉదయం మామిడిచెట్లకు ట్రాక్టర్ సాయంతో మందు పిచికారీ చేయిస్తున్నారు. కొద్దిసేపటికి పిచికారీ చేసే పర్టిలైజర్ మందుల కొరత ఏర్పడటంతో వెంకటేశు కళ్యాణదుర్గంలోని తన ఇంటిలోకి కుమారులకు ఫోన్ చేశాడు. పర్టిలైజర్ దుకాణంలో మందులు కొనుగోలు చేసి తీసుకుని రావాలని చెప్పాడు. దీంతో వెంకటేశు కుమారులు నరేంద్ర అలియాస్ నాని (25), చరణ్ అలియాస్ చిన్న (18) కళ్యాణదుర్గంలో మందులు కొనుగోలు చేసి ద్విచక్రవాహనంలో పాలవెంకటాపురానికి వెళ్లారు. మందులు తన తండ్రికి ఇచ్చారు. అదే సమయంలో అదే తోటలో ఉన్న నీటిసంపు దగ్గరకు వెళ్లారు. సంపులో నీరు తక్కువగా ఉన్నాయని భావించిన చరణ్ అందులోకి దిగాడు. ఈత రాకపోవటంతో నీటిలో మునిగిపోతుండగా గమనించిన సోదరుడు నరేంద్ర తనకు ఈత రాకపోయినా తమ్ముడిని రక్షించేందుకు సంపులోకి దూకాడు. ఇద్దరికీ ఈత రాకపోవటంతో నీటిలో మునిగిపోయారు. తన కుమారులు కన్పించకపోవటంతో కంగారుపడిన వెంకటేశులు సంపుదగ్గరకు పరుగున వెళ్లాడు. అయితే అప్పటికే నీటిలో మునిగిపోయిన నరేంద్ర, చరణ్ మృతిచెందారు. నరేంద్రకు ఆరు నెలల క్రితమే వివాహం అయిందని, ప్రస్తుతం పట్టణంలో స్లాబులకు కడ్డీలను కట్టే కూలి పనులకు వెళ్లేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. చరణ్ ఇంటర్ ఫెయిల్ అయ్యి పట్టణంలో తైవాన్ పంపుల రిపేరీ మెకానిక్‌గా పని చేస్తున్నాడని అన్నారు. చేతికొచ్చిన కుమారులిద్దరూ మృతిచెందడంతో తండ్రి వెంకటేశులు, వారి కుటుంబసభ్యులు చేసిన రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

ఎమ్మెల్యే దిగ్భ్రాంతి : బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురం వ్యవసాయ తోటలో నీటిసంపులో పడి ఇద్దరు యువకులు మృతిచెందడంపై స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడు. మృతుల కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు.క్షతగాత సహాయకులు తెలిపారు.



నరేంద్ర, చరణ్ మృతదేహాలు



నరేంద్ర (ఫైల్‌ఫోటో)



చరణ్ (ఫైల్‌ఫోటో)

జిల్లా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప

ప్రజాశక్తి - రాయదుర్గం

జిల్లాలో పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాయదుర్గంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో రైతులు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టి కష్టపడి పంటలు పండించినా, గిట్టుబాటు ధర లేకపోవడం, మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో దళారుల చేతుల్లో పడి పెద్ద ఎత్తున నష్టపోయి ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో ఆరుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. రాయదుర్గం నియోజకవర్గంలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ సకాలంలో సంచులు రైతులకు ఇవ్వకపోవడం వల్ల ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించేందుకు రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. మొక్కజొన్న పంటకు ప్రభుత్వం క్వింటాలుకు 2400 రూపాయలు మద్దతు ధర ప్రకటించినప్పటికీ రైతులు 1700 రూపాయలకు మించి ధర పొందలేకపోతున్నారన్నారు. శింగనమల నియోజకవర్గం లోని ఎల్లుట్ల గ్రామానికి చెందిన నాగలింగం అనే రైతు అరటి పంట పండించినా కొనుగోలు ధర లేక పొలంలోనే ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. జిల్లాలో రైతాంగం పరిస్థితి దయనీయంగా ఉందన్నారు పెట్టుబడి ఖర్చు పెరిగి, మార్కెటింగ్ సదుపాయం లేక గిట్టుబాటు ధర లేక అప్పులు తీర్చలేక గత్యంతరం లేని స్థితిలో ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వ ఆధ్వర్యంలోని పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. గుత్తిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినా ఒకరోజు మాత్రం తెరిచి మూసివేసారన్నారు. తాడిపత్రిలో ప్రారంభించలేదన్నారు. అరటి పంటకు గిట్టుబాటు ధర లేదని రైతులు ఆందోళన చేసినప్పటికీ ప్రభుత్వం దళారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఒప్పించారని, అయితే గిట్టుబాటు ధర లేక దళారులు చెప్పిన రేటుకి పంటను అమ్మి రైతులు నష్టపోయారన్నారు. టన్నుకు 15 వేల రూపాయలు చొప్పున అరటిపంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. రైతులు పండించిన పంటను దళారుల చేతిలో పెట్టాక ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా తక్షణం పంట కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున, పట్టణ కమిటీ సభ్యులు మధు, శివ, కనేకల్ మండల కార్యదర్శి నాగరాజు, డి హిరేహాల్ మండల కార్యదర్శి మల్లికార్జున, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా..!

తరిమెల

పెన్నానది నుంచి తరలింపు

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని తరిమెల గ్రామ సమీపంలో ఉన్న పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా ఆగలేదు. రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ కొంతమంది అక్రమార్కులు దోచుకుంటున్నారు. భారీగా ఇసుక తరలిస్తుండటంతో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సి అధికారులు, పోలీసు శాఖ మిన్నకుండిపోవడంతో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా ఆదివారం రాత్రి మైనింగ్ అధికారులు దాడి చేసి హిటాచీని స్వాధీనం చేసుకున్నారు. అయితే స్వాధీనం చేసుకున్న హిటాచీని తరలించకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

మైనింగ్, పోలీసు శాఖ జాయింట్ ఆపరేషన్

పోలీసులు, మైనింగ్ అధికారులు కలిసి మండలంలోని తరిమెల గ్రామంలో ఇసుక అక్రమ రవాణాపై జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఒక హిటాచీ, టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అభివృద్ధి పనులకుగానీ, సొంతిళ్లకుగానీ ఇసుక కావాలనుకుంటే తప్పనిసరిగా అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు.



పట్టుబడిన హిటాచీతో ఎస్ఐ

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ముందుకురండి

'డ్రగ్స్ వద్దు బ్రో-సైకిల్ తొక్కు బ్రో'లో ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎస్పీ పి.జగదీష్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన 'డ్రగ్స్ వద్దు బ్రో-సైకిల్ తొక్కు బ్రో' ర్యాలీని ఎస్పీ ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎస్పీ స్వయంగా సైకిల్ తొక్కి ర్యాలీలో ముందుకు సాగారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమై ర్యాలీ అంబేద్కర్ సర్కిల్, సప్తగిరి సర్కిల్, సుభాష్‌రోడ్డు, క్లాక్‌టవర్, ఎన్టీఆర్ సర్కిల్, శ్రీకంఠం సర్కిల్, పాతవూరు, తాడిపత్రి బస్టాండు, గాంధీబజార్, సంగమేష్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా గంజాయి వినియోగం, విక్రయం, సరఫరాతోపాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1972, డయల్ 112కుగానీ ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, మహిళా డీఎస్పీ ఎస్.మహబూబ్‌బాషా, డిటిసి డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, ఎఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, డిస్కవర్ అనంతపురం అనిల్, సిఐలు వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, రాజేంద్రనాథ్ యాదవ్, జగదీష్, శేఖర్, ఆర్ఐ పవన్‌కుమార్, ఈగల్ విభాగం సిఐ జయపాల్‌రెడ్డి, ఆర్ఎస్ఐ హనుమంతు, ఆర్ఎస్ఐలు, హోంగార్డుల ఇన్‌ఛార్జి, రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం సభ్యులు జాఫర్, బాబ్జాన్, మగ్బూల్, రమేష్‌నాయక్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ, శివ, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

ఉపాధ్యాయులతోనే శాస్త్రీయ సమాజ నిర్మాణం

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శాస్త్రీయ దృక్పథం కలిగిన సమాజ నిర్మాణం ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుందని జెవివి రాష్ట్ర గౌరవ సలహాదారులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ అన్నారు. ఆదివారం జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని కెఎస్ఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్ అధ్యక్షతన ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం, శాస్త్రీయ ఆలోచన పెంపొందించడమే లక్ష్యంగా జన విజ్ఞాన వేదిక పని చేస్తుందన్నారు. అందుకు ఉపాధ్యాయుల సహకారం ఎంతో అవసరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి సంవత్సరం జెవివి నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాల్లో నాలుగు లక్షలకుపైగా విద్యార్థులు పాల్గొంటారని, ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే పరీక్షల తర్వాత అధికంగా పాల్గొనేది చెకుముకి సైన్స్ కార్యక్రమంలోనని తెలిపారు. ఉపాధ్యాయుల సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించిన దేశాలే అభివద్ధిలో ముందు స్థానంలో ఉన్నాయని అన్నారు. విద్యార్థులలో మార్పు తీసుకురాగల సామర్థ్యం ఒక ఉపాధ్యాయులకే సాధ్యమని, ఆ మార్పు శాస్త్రీయ దక్పథం వైపు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎ.చంద్రశేఖర్, జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు, జిల్లా కోశాధికారి మహమ్మద్ జిలాన్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసరావు, మ్యాజిక్ కన్వీనర్ ప్రసాద్, నగర అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, తిరుపాల్, నగర కోశాధికారి రామిరెడ్డి, నాయకులు రామకృష్ణ, లక్ష్మీనారాయణ, రాధాకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గేయానంద్

న్యూట్రల్ పోలీసింగ్ చేస్తాం

తప్పు చేసినవారు జైలులో ఉండే విధంగా చర్యలు

తాడిపత్రి ఎఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

తాడిపత్రిలో శాంతిభద్రత పరిరక్షణ విషయంలో పోలీసువ్యవస్థ న్యూట్రల్‌గా వ్యవహరిస్తుందని తాము ఎవరి పక్షమూ కాదని తప్పు చేసిన వారెవరైనా జైళ్లో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామనితాడిపత్రి ఎఎస్పి రోహిత్ కుమార్ చౌదరి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలపై ఆయన మాట్లాడారు.

ప్రశ్న : తాడిపత్రిలో శాంతిభద్రత పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలేమిటీ ?

ఎఎస్పీ : తాను ఎఎస్పీగా మొట్టమొదటి పోస్టింగు తీసుకున్న ప్రాంతమిది. ఇక్కడ శాంతిభద్రతలు పరిరక్షణలో ఉండే విధంగా కృషి చేస్తున్నాను. తప్పు చేసిన వారు ఎవరైనా సరే వారు జైళ్లో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నా. చట్టం పట్ల అందరికీ గౌరవముండాలి. అందుకు అనుగుణంగా నడుచుకునే విధంగా చూడాల్సిన బాధ్యత మాపై ఉంది. ఆ రకమైన చర్యలే తీసుకుంటున్నాం.

ప్రశ్న :మీరు ఎఎస్పీగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఎటువంటి చర్యలు తీసుకున్నారు ?

ఎఎస్పీ : నేను జనవరి 18వ తేదీన బాధ్యతలు తీసుకున్నాను. అప్పటి నుంచి ఈ ప్రాంతంలోనున్న ప్రత్యేక పరిస్థితులను గమనించాను. మాట్కా, గాంబ్లింగ్, గంజాయి అమ్మకాలు తదితర అంశాలపై దృష్టి సారించా. గతేడాది మాట్కాపై 15 కేసులు నమోదయిఉంటే ఈసారి సెప్టంబరు నాటికి 79 నమోదయ్యాయి. గ్యాంబ్లింగ్ కేసులు గతేడాది 240 అయితే ఈసారి 270 కేసులు నమోదు చేశాం. డివిజన్ పరిధిలో మొత్తం 800 మందిపై రైడీషీట్స్ ఉన్నాయి. ఇందులో ఎవరు యాక్టివ్‌గానున్నారో గుర్తించి వారికి కౌన్సిలింగు ఇవ్వడం జరుగుతోంది. 492 మందిని ఈ రకంగా కౌన్సిలింగు చేశాం. వీరిలో 11 మందిని రిమాండ్ చేశాం. ఇంకా చాలా మంది పిటి వారెంట్స్‌లోనూ, కోర్టులకు హాజరు కాకుండా సంవత్సరాలుగా ఉంటున్నవారు ఉన్నారు. వారందరినీ కోర్టు ముందు హాజరు పరిచే విధంగా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : మీపై కొన్ని రాజకీయ విమర్శలు వస్తున్నాయి. వాటికి ఏమి సమాధానం చెబుతారు ?

ఎఎస్పీ : పనిచేసే క్రమంలో కొన్ని విమర్శలు రావచ్చు. అయితే తాము ఎవరి పక్షమూ వహించడము లేదని మాత్రం స్పష్టంగా చెప్పగలను. తప్పును బట్టి చర్యలుంటున్నాయి. అందుకే విమర్శలు ఒక్కవైపు నుంచే ఉండటం లేదు. రెండు వైపుల నుంచి ఉంటున్నాయి. ఏది ఏమైనా తాడిపత్రి పోలిసింగును న్యూట్రల్‌గా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : టిటిడి విజిలెన్సు అధికారి సతీష్‌కుమార్ మృతిపై విచారణ ఎంత వరకు వచ్చింది ?

ఎఎస్పీ : ఆ కేసు విచారణ కొనసాగుతోంది. అయినా ఈకేసు విచారణకు సంబంధించి వివరాలను నేరుగా న్యాయస్థానానికి అందజేయాల్సి ఉంటుంది. కావున వివరాలు అందజేయలేం. మొత్తంగా అన్ని కోణాల్లో అయితే విచారణ కొనసాగుతోంది.





ఎఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దేశ రక్షణలో సైనికులు, మాజీ సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. ఆదివారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సాయుధ దళాల పతాక నిధికి తనవంతు విరాళాన్ని హుండిలో వేసి సాయుధ దళాల పతాక దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌కు పుష్పగుచ్ఛం అందించి, కలెక్టర్ చొక్కా జేబుపై గౌరవ సూచకంగా ఆర్మీ సాయిధ దళాల పతాక నిధి స్టికర్‌ను అతికించి ధన్యవాదాలు తెలిపారు.


అంతకుముందు సాయుధ దళాల పతాక దినోత్సవ ర్యాలీని నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి క్లాక్ టవర్ వరకు నిర్వహించి, విరాళాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ సైనికులు, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, సిబ్బంది గిరీష్, బాబా ఫక్రుద్దీన్, అమరనాథ్, అనిల్, రమాదేవి పాల్గొన్నారు.

పంపనూరును రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా మారుద్దాం

ఎమ్మెల్యే సునీత

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా మారుద్దామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. పంపనూరు ఆలయ నూతన పాలక మండలి ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, మంజునాథ స్వామి, పార్వతి దేవి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి పల్లకి సేవలో పాల్గొన్నారు. ఆలయ ఆవరణానికి సమీపంలో రూ.30లక్షల స్వచ్ఛభారత్ మిషన్ నిధులతో 22 సౌచాలయాల (మరుగుదొడ్ల) నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారంలో పాల్గొన్నారు. ఛైర్మన్ గా వేణుగోపాల్ రెడ్డి, ఇతర సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ అభివద్ధికి నూతన పాలక మండలి సభ్యులు చిత్తశుద్ధితో బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఆలయ అభివృద్ధికి రూ.14.50కోట్లు కావాలని అంచనా వేశారన్నారు. ఈ నిధుల కోసం ముఖ్యమంత్రితో పాటు దేవాదాయశాఖ మంత్రి, ఇతర అధికారుల వద్దకు వెళ్దామని.. అంతా కలసి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్దామని ఎమ్మెల్యే అన్నారు.



పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీత

ప్రజాశక్తి
www.prajasakti.com

కుడి కాలువ గండిని వెంటనే పూడ్చాలి

ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పిఎబిఆర్ డ్యాం నుంచి కుడి కాలువకు పడిన గండిని వెంటనే పూడ్చి సకాలంలో చెరువులకు నీరు అందించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.హెచ్.రాయుడు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివారం తెల్లవారుజామున కూడేరు మండలం జల్లిపల్లి వద్ద కుడి కాలువకు గండిపడి పెద్ద ఎత్తున నీరంతా పొలాల్లోకి ప్రవహించిందన్నారు. దీంతో వరి, వేరు శనగ, చీని ఇతర పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కుడి కాలువ కింద ఉన్న 49 చెరువులకు పూర్తిస్థాయిలో నీరు చేరాలంటే కాలువకు ఎక్కడ గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్నికల్లో యాదవులకు ప్రాధాన్యత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు యాదవులకు ప్రాధాన్యత కల్పించాలని యాదవ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి న్యాయవాది రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వామి యాదవ్, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలో ఉన్న శ్రీకృష్ణ మందిరం ఆవరణలో గుంతకల్లు నియోజకవర్గస్థాయి యాదవుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు అవకాశం ఇవ్వాలని, లేనిపక్షంలో స్వతంత్రులుగా బరిలోకి దిగి గెలుపు ఓటములను నిర్ణయిస్తామని హెచ్చరించారు. అనంతరం రాష్ట్ర, జిల్లా నాయకులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు యాదవ్, జిల్లా కార్యదర్శి గోపాల్ యాదవ్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ఆమ్మెట్ మస్తాన్ యాదవ్, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి, మహిళా ఉపాధ్యక్షురాలు సి.రాధాయాదవ్, మండల అధ్యక్షులు శ్రీనివాసులుయాదవ్, నాయకులు గురుప్రసాద్ యాదవ్, శంకర్‌మహదేవ్, ఎన్.శ్రీనివాసులు, ఎ.నరసింహులు, ఇసురాళ్లపల్లి కిట్టయాదవ్, ఎన్.రంగారెడ్డియాదవ్, రంగాయాదవ్, సూర్యనారాయణ, బలరాముడు, మెకానిక్ రాము, చిన్న ఓబయ్య యాదవ్, ఓబులరాజు, తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ



తాడిపత్రిలో పోస్టర్లను విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆదివారం తాడిపత్రిలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి హిదాయతు ఫయాజ్ బాషా ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో 35వ వార్డు కౌన్సిలర్ ఎ.రియాజ్, వక్ఫ్ బోర్డు మాజీ ఛైర్మన్ అల్లాఫ్‌వలీ, చవ్వా రాజశేఖర్‌రెడ్డి, కుమార్, 4వ వార్డు ఇన్‌ఛార్జ్ షబ్బీర్, ఖాజాపీర్, చిట్టి జాఫర్, సయ్యద్ షాషావలి, రసూల్, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను నిరసిస్తూ ఆదివారం మండల పరిధిలోని చెర్లోపల్లి, కుమ్మనమల గ్రామాల్లో వైసిపి నాయకులు కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తిరుపాలరెడ్డి, శ్రీరాములు, రామకృష్ణ, పాల్గొన్నారు.

గుత్తి : వైద్య కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పట్టణంలోని జంగాల కాలనీలో కౌన్సిలర్ మహబూబ్‌బాషా, 17వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జ్ అంగడి దస్తగిరి ఆధ్వర్యంలో ఆదివారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సి.వి.రంగారెడ్డి, వైసిపి యువజ జిల్లా కార్యదర్శి కుమ్మెత రాజశేఖర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి వై.బ్రహ్మేంద్రకుమార్, ఉపాధ్యక్షుడు శర్మాస్, బూత్ కన్వీనర్ బుల్లెట్ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయండి

ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ బి.వెంకటరమణబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మొక్కజొన్న ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రైతాంగానికి రక్షణ కల్పించాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ బి.వెంకట రమణబాబు డిమాండ్ చేశారు. ఆదివారం శెట్టూరు మండలం యాతకల్లు, బొలగుప్ప, మండలం నరసాపురం గ్రామంలో విక్రయానికి సిద్ధంగా మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేద్యం ఖర్చులు పెరుగుతున్నా, పంటకు మద్దతు ధర లభించక మొక్కజొన్న రైతులు అప్పుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు ప్రయివేట్ మార్కెట్‌లో కేవలం రూ.1900 నుంచి రూ.2000 మాత్రమే పొందుతున్నారన్నారు. కొన్ని చోట్ల ఇంకా తక్కువ ధరలే లభిస్తున్నాయన్నారు. దీంతో పెట్టుబడి కూడా రాక రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారన్నారు. కావున ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఆప్ నాయకులు

పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి-అనంతపురం

పిఆర్‌సి కమిషన్‌ను ఏర్పాటు చేసి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎన్.రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని నీలం రాజశేఖరరెడ్డి భవనంలో జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1.7.2023 నుంచి అమలు చేయాల్సిన పిఆర్‌సిని ఇంతవరకు చేయకపోవడం బాధాకరమన్నారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. వెంటనే కమిషన్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎన్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్.రామాంజనేయులు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణమూర్తి, రాష్ట్ర అదనపు కార్యదర్శి జి.సూర్యుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ రామాంజనేయులు, ఎన్నికల అధికారి, పరిశీలకులు నాగరాజు, గోకారి, తదితరులు పాల్గొన్నారు.

పామిడిలో గుమ్మనూరు ఈశ్వర్ పర్యటన



బాధితుడిని పరామర్శిస్తున్న ఈశ్వర్

ప్రజాశక్తి-పామిడి

పామిడి, గుత్తి మండలాల టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ ఆదివారం మండలంలో పర్యటించారు. స్థానిక గంగమ్మ ఆలయంలో నిర్వహించిన జాతరలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలంలోని జి. కొట్టాల గ్రామంలో అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటి వద్ద ఉన్న టిడిపి నాయకులు తిప్పారెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా తిప్పారెడ్డిని ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగగా ఓ వృద్ధురాలు పింఛన్ ఇవ్వాలని విన్నవించారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్‌డిఎ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పివికెకెలో ముగిసిన క్రీడా మహోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

పివికెకె ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్)లో మూడు రోజుల పాటు జోష్‌గా సాగిన ఇంటర్ జూనియర్ కళాశాలల స్పోర్టెక్ 2కె25 క్రీడా మహోత్సవం ఆదివారం వైభవంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ ఎస్పీ యర్లగడ్డ ప్రసాద్ విజేతలకు పతకాలు, ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ కిషోర్ పల్లె, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, కోశాధికారి పల్లె సింధూర, ప్రత్యేకాధికారి శ్రీనివాసులురెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, డీన్ సంతోష్‌కుమార్‌రెడ్డి, పివికెకె డిప్లొమా ప్రిన్సిపాల్ వైభవ్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, ఎఒ మనోహర్‌రెడ్డి, కన్వీనర్లు బాలసుబ్రమణ్యం, రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ముగింపు కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు

సచివాలయ ఉద్యోగులపై భారం తగ్గించాలి

ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.గురుస్వామి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై పెరుగుతున్న సర్వేల భారాన్ని తక్షణమే తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.గురుస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని గణేనాయక్ భవనంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెడుతున్న సర్వేల భారంతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడిలో పని చేస్తున్నారని తెలిపారు. గతంలో సర్వే భారం తగ్గిస్తామని అధికారులు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. పైగా, కొత్త సర్వేలు పెంచడం కక్షపూరిత చర్యగా కనిపిస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందన్నారు. సచివాలయ ఉద్యోగులపై సర్వేల భారం తక్షణమే తగ్గించాలన్నారు. ఉద్యోగులందరినీ మాతశాఖలకు అప్పగించి స్పష్టమైన ప్రమోషన్ ఛానల్ ప్రకటించాలన్నారు. అన్ని శాఖల సీనియారిటీ జాబితాలను విడుదల చేసి అర్హులకు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. క్రమబద్ధీకరణ ఆలస్యంతో నష్టపోయిన 9 నెలల వేతనాలు (అరియర్స్) వెంటనే చెల్లించాలన్నారు. జాయినింగ్ తేదీ నుంచి ఇవ్వవలసిన నోషన్ ఇన్‌క్రిమెంట్లు వెంటనే మంజూరు చేయాలన్నారు. శానిటేషన్ సెక్రటరీలను ఇబ్బందులకు గురి చేస్తున్న 423 జిఓను రద్దు చేసి సమాన సమయపాలన కల్పించాలన్నారు. వారి జాబ్ చార్ట్ ప్రకారం ఫారెస్ట్, ఎన్విరాన్మెంట్, హెల్త్, పోల్యూషన్ కంట్రోల్ బోర్డ్ శాఖలకు అప్పగించాలన్నారు. ఇంటింటి సర్వేను తప్పనిసరి చేసిన 11 జిఓను సవరించి అత్యవసర సందర్భంలో మాత్రమే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, ఎస్.నాగేంద్రకుమార్, గ్రామ వార్డు సచివాయల ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు సూర్యప్రకాష్, ప్రదీప్, రఫీ, సురేంద్ర, స్వర్ణ, నితిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య నాయకులు

104 ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

సిఐటియు జిల్లా కోశాధికారి ఎం.నాగమణి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

104 వాహనాల్లో పని చేస్తున్న సిబ్బందికి అరబిందో కంపెనీ నుంచి రావాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా కోశాధికారి ఎం.నాగమణి, 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివకృష్ణ, సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో 104 ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తు ప్రజా సంజీవనిగా పేరు తెచుకున్న 104 వాహనాల్లో పని చేస్తున్న సిబ్బంది మాత్రం సమస్యలు వలలో చిక్కుకొని ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చాలీచాలని వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. అరబిందో నుంచి రావాల్సిన బకాయిలు గ్రాట్యుటీ, ఎర్న్ లీవ్‌లు, డబ్బులు విషయంలో అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అరబిందో నుంచి రావాల్సిన బకాయిలు ఇప్పించాలన్నారు. ఉద్యోగులందరికీ నియామక పత్రాలు ఇప్పించాలన్నారు. జీత భత్యాలు తెలిపే పే స్లిప్స్ ఇప్పించాలన్నారు. ఎటువంటి అనుభవం లేని డేటా ఎంట్రీ ఆపరేటర్‌కి మందుల నిర్వహణ బాధ్యతలు తొలగించాలన్నారు. జీతాల్లో వత్యాసం సవరించి ఇప్పటి వరకు కోత విధించిన డబ్బులు అరియర్ రూపంలో ఇప్పించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి ఇచ్చిన శోకాజ్ నోటీసు మీద పునరాలోచన చేసి విచారణ చేయాలన్నారు. ప్రస్తుత మార్కెట్‌కు అనుగుణంగా డేటా ఎంట్రీ ఆపరేటర్‌కి జీతాలు రూ.18500 పెంచాలన్నారు. 5 సంవత్సరాల సర్వీస్ పూర్తి అయిన డ్రైవర్‌లకు ఆటోమెటిక్‌గా స్లాబ్ అమలు చేయాలన్నారు. ప్రతి డివిజన్‌కి ఒక బఫర్ సిబ్బందిని నియమించాలన్నారు. కార్మిక చట్ట ప్రకారం క్యాజువల్ లీవ్‌లు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో 104 ఉద్యోగుల సంఘం నాయకులు కిషోర్, మల్లికార్జున ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు



వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న శైలజానాథ్

కార్యకర్తలకు అండగా ఉంటాం

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త శైలజనాథ్

ప్రజాశక్తి-యల్లనూరు

వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటామని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త శైలజనాథ్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ శుభ కార్యానికి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డితో కలిసి వచ్చిన ఆయన పలువురు కార్యకర్తల సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా కొళాయిలకు నీరు రావడం లేదని, కాలువల్లో పూడిక తీయడంలేదని ఎస్‌సీ కాలనీవాసులు వాపోయారు. తర్వాత స్థానిక జిల్లా ఉన్నత పాఠశాల సెంటర్‌ను తొలగించి చిలమకూరు ఆదర్శ పాఠశాలకు మార్చారని, తిరిగి యల్లనూరులోనే పరీక్ష సెంటర్‌ను ఏర్పాటు చేయించాలని కోరారు. ఇందుకు స్పందించిన శైలజనాథ్ వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారితో మాట్లాడి యల్లనూరు పాఠశాలనే సెంటర్‌గా మార్పు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వృద్ధురాలికి వైద్య పరీక్ష

ఎస్సీ కాలానికి చెందిన రంగమ్మ శైలజనాథ్‌కు సమస్యలను వివరిస్తూ ఫిట్స్‌తో కళ్లు తిరిగి కింద పడిపోగా వైద్యులు అయిన శైలజానాథ్ ఆమె నాడి పట్టుకుని వైద్యపరీక్ష చేశారు. నెమ్మదిగ ఆమె ముఖం పై నీళ్లు చల్లుతూ ఇంటి వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. తర్వాత కళ్లు తెరిచింది. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి విష్ణునారాయణ, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు దొడ్లో కిరణ్‌కుమార్, ఎంపిటిసి తిమ్మోతి కల్లూరు సూర్యనారాయణ, అనుపూరి సుబ్బయ్య, రవికుమార్, ఎంఆర్‌పిఎస్ నాయకుడు రామ్మోహన్, చంద్ర, పేర్ల నాగేశ్వరరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, దొడ్లో రామాంజనేయులు, అశ్వర్థరెడ్డి, ఉమా మహేశ్వరరెడ్డి, అన్సర్‌బాషా, పక్కీరప్ప, బాషా, సర్పంచు ఓబుళమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు కేరాఫ్ 'హిమబిందు' ఇంటీరియర్స్

అధినేత గోపీనాథ్ ఆచారి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నూతన ఇంట్లో కిచెన్‌కు సంబంధించిన వస్తువులకు కేరాఫ్‌గా నగరంలోని బళ్లారి రోడ్డులో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయం ఎదురుగా ఉన్న హిమబిందు ఎంటర్‌ప్రైజెస్, ఇంటీరియర్స్ నిలుస్తోంది. ఈ సందర్భంగా ప్రజాశక్తితో యజమాని గోపీనాథ్ ఆచారిని మాట్లాడుతూ కార్పెంటర్ పనిలో తనకున్న 35 సంవత్సరాల అనుభవంతో మాడ్యులర్ కిచెన్ ఐటమ్స్ తయారు చేసే ఫ్యాక్టరీని మూడేళ్ల క్రితమే ప్రారంభించినట్లు తెలిపారు. కిచెన్ ఐటమ్స్‌ను తయారు చేయడంలో చేతి పని కంటే అత్యున్నతమైన మిషన్ వర్క్‌తో చేయడం తమ ప్రత్యేకత అన్నారు. కిచెన్ కబోర్డ్స్ అత్యంత ఆకర్షణీయంగా ఉంటాయన్నారు. ఇంటి యజమానికి ఇంటి లోపల ఆవరణ విశేషమైన ఆకర్షణ, అనుభూతిని కలుగజేస్తాయన్నారు. అలాగే అధిక నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఉత్పత్తులే కాకుండా వినియోగదారులకు ఎంతగానో ఉపయోగం కలిగే ప్రత్యేక పీవీసీ గ్లాస్ గూర్చి లామినేషలో బబుల్స్ ఏర్పడనివ్వకుండా మన్నిక వచ్చేలా తయారు చేస్తున్నట్లు తెలిపారు. చాలా అరుదుగా మాత్రమే చూడగలిగే ఎడ్జ్ బ్యాండింగ్, ఉన్నంతమైన ఫినిషింగ్ ఇవ్వడం తమ ప్రాముఖ్యత అని వివరించారు. ఇవే కాకుండా బెడ్‌రూమ్ కబోర్డ్స్, టీవీ యూనిట్, సిట్ అవుట్ ఆర్చ్, యూపీవీసీ విండోస్ తదితర వాటిని తయారు చేస్తున్నట్లు తెలిపారు.



హిమబిందు ఎంటర్‌ప్రైజెస్, ఇంటీరియర్స్ దుకాణం



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న 4వ పట్టణ సిఐ

జిల్లావ్యాప్తంగా రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లావ్యాప్తంగా రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇందులో భాగంగా ఆయా పోలీసుస్టేషన్ల పరిమితుల్లో రౌడీషీటర్లను పిలిపించి సమాజంలో శాంతి-భద్రత ఎంత ముఖ్యమో అవగాహన కల్పించారు.


పెద్దవడుగూరు : ఎస్పీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ఆంజనేయులు మాట్లాడుతూ రౌడీషీటర్లు అనవసర గొడవలు, వివాదాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో జీవనం సాగించాలని సూచించారు.

చదువుతోనే ఉన్నత స్థానాలు

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్

చదువుతోనే ఉన్నత స్థానాలు అధిరోహించవచ్చని విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీరాములు, డాక్టర్ అంకె రామలింగయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ కేంద్ర కార్యాలయంలో 'పుస్తక పఠనం మాకు ఇష్టం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమా, డిప్యూటీ లైబ్రేరియన్ పి.కమ్మన్న, శిక్షకులు శ్రీరాములు, అంకె రామలింగయ్య హాజరై విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించారు. ఈ కార్యక్రమంలో సహాయ గ్రంథాలయాధికారి, డి.గోవిందు, గ్రంథాలయ సిబ్బంది బి.ముత్యాలమ్మ, ఉజ్జనేశ్వరి, శిరీషాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌ఆర్‌ఐటి'లో ఇంటెలిజెన్స్ టెస్టు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు


ప్రజాశక్తి-శింగనమల

గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం వద్ద ఉన్న ఎస్‌ఆర్‌ఐటి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటెలిజెన్స్ టెస్టు నిర్వహించారు. ఈ పరీక్షకు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ధర్మవరం, మడకశిర, గుత్తి, పెనుకొండ, హిందూపురం, రాయదుర్గం, కళ్యాణదుర్గం వంటి పలు ప్రాంతాల నుంచి ఎంపిసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 1,660 మంది హాజరయ్యారు. ఈ టెస్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డిసెంబర్ 22న బహుమతులు అందజేయనున్నారు.

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వండి

ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య

ప్రజాశక్తి-గుత్తి



అతిథులను సన్మానిస్తున్న దృశ్యం

వచ్చే జనవరి నుంచి ఫిబ్రవరి 28వతేదీలోపు పెన్షన్‌దారులు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు (డిఎల్‌సి) ఇవ్వాలని ఖజానా శాఖ ఉప సంచాలకులు రమణయ్య కోరారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్ల భవనంలో పెన్షనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉప ఖజానా అధికారి కార్యాలయం, మీసేవ కేంద్రం, పెన్షనర్ల భవనంలో తమ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను పెన్షన్ దారులు సమర్పించవచ్చన్నారు. అనంతరం ఖజానా శాఖ ఉపసంచాలకులు రమణయ్యను నాయకులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపఖజానాధికారి సురేష్ బాబు, రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు కె.అబూబకర్, ఉపాధ్యక్షుడు షేక్షావలి, కార్యదర్శి రామ్మోహన్, కోశాధికారి జెన్నే కుళ్లాయిబాబు, నాయకులు నారాయణరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, ఫక్రుద్దీన్, శామ్యూల్, శ్యామ్ డానియల్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నాగరాజు

ప్రజాశక్తి-కుందుర్పి



వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా జి.నాగరాజు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన వైసిపి అధినేత జగన్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.



బిసి సెల్ రాష్ట్ర సెక్రటరీగా రాము

వైసిపి బిసి సెల్ రాష్ట్ర సెక్రటరీగా రాము నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన వైసిపి అధినేత జగన్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. తనను గుర్తించి ఎస్సీ సెల్ రాష్ట్ర సెక్రటరీగా అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. వారి నమ్మకవాన్ని వమ్ము చేయకుండా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు.

ఆశ్రమంలో అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో ఎయిమ్ ఫర్ సేవా స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలో 34 మంది విద్యార్థులకు ఆదివారం అన్నదానం చేశారు. అన్నదానానికి ట్రస్టు సభ్యులు రేజీ కొరియన్ సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు స్వామి సత్యాత్మానంద, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

'జై సీతారాం'తో రాయలసీమ మాండలికానికి గౌరవం



పోస్టర్లను విడుదల చేస్తున్న అతిథులు

అనంతపురం : రాయలసీమ మాండలిక భాషకు కవిత్వ గౌరవాన్ని ఇచ్చిన సహజ వాగ్గేయకారుడు 'కవికాకి' జైశ్రీరామం అని ప్రముఖ సాహితీవేత్త తూముచెర్ల రాజారం కొనియాడారు. జై సీతారాం శత జయంతిని పురస్కరించుకుని అనంత సాహితీ సంస్థల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా జై సీతారాం రచించిన పద్య కవిత్వాన్ని చంద్రశేఖరశాస్త్రి విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు యంగన్న, అంకే శ్రీనివాస్, శాంతి నారాయణ, అడవాల శేషగిరి రాయుడు, కొత్తపల్లి సురేష్, ఈశ్వర్‌రెడ్డి, వంగళం కొండారెడ్డి, రాజశేఖర్, జయరాం, తరిమల అమరనాథ్‌రెడ్డి, చిన్నకోట్ల పెద్దిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సుంకులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

గుత్తి : మండలంలోని బాచుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బాట సుంకలమ్మ ఆలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు జి.వెంకటశివుడు యాదవ్ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచు కె.రమేష్‌నాయుడు, తెలుగు యువత నాయకుడు కరిడికొండ సుధాకర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

అనంతపురం : నగరంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ గుత్తి ఎడిఎ వెంకటరాముడు, అనంతపురం మండల వ్యవసాయ అధికారి ఎ.వెంకటాకుమార్ నేతృత్వంలో ఆదివారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రుద్రంపేటలోని న్యూ శ్రీనివాస ఫర్టిలైజర్స్‌ను తనిఖీ చేయగా రాయల్ ఆగ్రోలైఫ్ సైన్స్ కంపెనీకి చెందిన1.2 మెట్రిక్ టన్నుల హైజిన్ సి రూ.97,272 స్టాక్‌ను సీజ్ చేశారు. అదేవిధంగా గుత్తి రోడ్డులోని ఉమా గోడౌన్ తనిఖీ చేయగా మ్యాట్రిక్ కంపెనీకి చెందిన 220 లీటర్లు రూ.2,08,000 విలువైన లిక్విడ్ ఫర్టిలైజర్ స్టాప్ సెల్ ఇచ్చినట్లు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అనంతపురం కలెక్టరేట్ : నేడు జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) ఈ కార్యక్రమం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్జీదారులు తమ వివరాలతో పాటు సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మిత్రునికి ఆర్థికసాయం

నార్పల : మండల కేంద్రానికి చెందిన తోటి మిత్రుని ఆర్థికసాయం అందజేసి స్నేహితులు మానవత్వం చాటుకున్నారు. 1992లో నార్పల ప్రభుత్వ బాలుర పాఠశాలలో పదో తరగతి చదివిన కుళ్లాయిస్వామి గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న తోటి మిత్రులు చెందాలు వేసుకుని సేకరించిన రూ.50వేలను కుళ్లాయిస్వామి ఇంటికి వెళ్లి అందజేశారు.

టిడిపితోనే గ్రామాల అభివృద్ధి : విప్ కాలవ

ప్రజాశక్తి-కణేకల్లు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కాలవ శ్రీనివాసులు

తెలుగుదేశం ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని హనకనహల్ గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించారు. తర్వాత రూ.15లక్షలతో సిసి రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా గ్రామాలు అభివృద్ధి చెందడం లేదన్నారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ వన్నారెడ్డి, మాజీ వైస్ ఎంపిపి సుజాత, వేలూరు మరియప్ప, జిన్నా బాబు, ఆనందరాజ్, లాలెప్ప, సుదర్శన్, చాందు, విజయ్, మాజీ డీలర్ వెంకటేష్, మారెప్ప, తదితరులు పాల్గొన్నారు.